క్లుప్తంగా

వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు రూ.19 కోట్లు

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం కింద విజయవాడ రూరల్ మండలంలోని డ్వాక్రా గ్రూపుల మహిళలకు 19కోట్ల 12లక్షల 51 వేల790 రూపాయలను శనివారం జమచేసినట్టు ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ విధంగా వరుసగా మూడు దఫాలుగా మహిళల బ్యాంక్ ఖాతాల్లో 19 కోట్ల 12 లక్షలు జమ జరిగినట్టు ఆమె తెలియజేశారు. మండలంలో 2వేల ఒక గ్రూపుల్లోని 19వేల 799 మంది డ్వాక్రా గ్రూపుల మహిళలకు ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు.

పేద కుటుంబాలకు అండగా సేవా కార్యక్రమాలు

కంకిపాడు: మండలంలోని నెప్పల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు కోల్పోయిన గొర్ల శివభవాని కుటుంబానికి గ్రామానికి చెందిన చలసాని నాగమణి ఫౌండేషన్ (అమ్మాజీ చారిటబుల్ ట్రస్టు) ఆధ్వర్యంలో తానా సభ్యులు హేమా కానూరు, వెల్లంపల్లి సందీప్ శనివారం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఫౌండేషన్ అధినేత చలసాని అరుణ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఈడుపుగంటి కిరణ్ మరికొందరు విద్యార్థుల చదువులకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో నల్లూరి కిరణ్, వల్లభనేని శివ, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కొండవీటి రత్నబాబు, కె.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి



గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పిలుపునిచ్చారు. మండలంలోని అల్లాపురంలో శనివారం సర్పంచ్ డొక్కు వెంకన్న బాబు అధ్యక్షతన ''మా నమ్మకం నువ్వే జగనన్న'' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలకు వివరించాలని చెప్పారు. జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు గంతోటి ప్రశాంతి, ఉపసర్పంచి అవుటపల్లి శివప్రసాద్, పార్టీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, మేచినేని బాబు, ఎస్‌కేఎంఎంపీ కలాం, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

తాడిగడపలో ఎన్ఎస్ఎస్ శిబిరం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు వారం రోజుల పాటు తాడిగడపలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాలేజీ డీన్ బావినేని పాండురంగారావు శనివారం శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తాడిగడపలో ఎన్ఎస్ఎస్ సేవలు అందిస్తామన్నారు. స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ నిషేధం, మాదకద్రవ్యాలపై అవగాహన, పలు సేవా కార్యక్రమాలు చేస్తామని నరేంద్ర తెలిపారు.

పాతపాడు గ్రామ కార్యదర్శి చెన్నకేశవరావుకు సన్మానం

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావును ఆదర్శంగా తీసుకుని మిగిలిన కార్యదర్శులు కూడా నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఈఓఆర్డీ బీవీ శేషగిరి రావు అన్నారు. 2022–23వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాతపాడు గ్రామంలో ఇంటిపన్ను మొత్తం 9 లక్షల 88వేల 81 రూపాయలు శాతం వసూలు చేసినందుకు గాను శనివారం పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి చెన్నకేశవరావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దేవగిరి సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బంది సహకారంతోనే నూరుశాతం ఇంటి పన్ను వసూలు చేసినట్టు కార్యదర్శి చెన్నకేశవరావు అన్నారు.

27, 28 తేదీల్లో వణుకూరులో డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ పర్యటన



పెనమలూరు: మండలంలోని వణుకూరు గ్రామాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ సందర్శిస్తారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. ఆయన వణుకూరులో శనివారం పర్యటించారు. వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే, సచివాలయాన్ని సందర్శించి, జిల్లా అధికారులతో మాట్లాడారు. వెల్‌నెస్ సెంటర్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, ఆర్బీకేల ద్వారా రైతులకు, గ్రామ సచివాలయంతో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పాలన తీరును డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ పరిశీలిస్తారని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ పర్యటనకు వచ్చినప్పుడు ప్రజలకు అందుతున్న సేవలు సిబ్బంది వివరించాలని సూచించారు.

రక్తహీనత నివారణకు పౌష్టికాహారం



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత జోషి



పౌష్టికాహారం పక్షోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు

పెనమలూరు: రక్తహీనత నివారించటానికి పౌష్టికాహారం తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. కానూరులో శనివారం ఐసీడీఎస్ 2 ప్రాజెక్టు పరిధిలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవటం వలన రక్త హీనత నివారించవచ్చని సూచించారు. మిల్లెట్లు ఎక్కువగా తీసుకోవటం వలన పౌష్టికాహారం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో సీడీఈవో జి.మంగమ్మ, సిద్ధార్థ మహిళా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అన్నపూర్ణ శర్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆంధ్రప్రదేశ్ కోసం పనిచేద్దాం

రామవరప్పాడు: పోషకాహారం అందరికీ అందేలా చూసి ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కలిసికట్టుగా పనిచేద్దామని సీడీపీవో సుకన్య అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రాజులబజార్ వాటర్‌ట్యాంక్ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ నిత్యం మనం తీసుకునే ఆహార పదార్థాల్లో చిరు ధాన్యాలు ఉండే విధంగా చూసుకుంటే ఆరోగ్య సమస్యలు తొలగుతాయనితెలిపారు. మునగాకులో ఐరన్, కాల్షియం ఉంటాయని నిత్యం మనం మునగాకు పొడిని తొలి ముద్దలో కలుపుకొని తింటే మంచి ఆరోగ్యం మన సొంతమవుతుందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత జోషి మాట్లాడుతూ ఆకుకూరలను ప్రతి రోజు ఆహారంలో తీసుకోవాలన్నారు.

పౌష్టికాహారం విశిష్టత తెలియజేస్తూ ర్యాలీ

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ముస్తాబాద సెక్టార్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవం ర్యాలీ జరిగింది. స్థానిక హైస్కూల్ నుంచి విద్యార్థులు ప్రదర్శనగా గ్రామంలో పర్యటించారు. 15రోజుల పాటు జరిగే పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం విశిష్టత తెలియజేయాలని ఉపాధ్యాయులు సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా

పెనమలూరు: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించారు. గంగూరు అంగన్‌వాడీ కేంద్రం (306)లో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు ఆధ్వర్యంలో తల్లులు, చిన్నారులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. వణుకూరు అంగన్‌వాడీ కేంద్రం 4లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా 2కె వాక్ నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలపై తల్లులకు అవగాహన కల్పించారు.

అభయాంజనేయుడికి మహిళా న్యాయమూర్తుల పూజలు



అభయాంజనేయ స్వామి దేవస్థానంలో న్యాయమూర్తులు నాగ శైలజ, దుర్గా కల్యాణి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని న్యాయమూర్తులు ఆకుల నాగ శైలజ, దుర్గా కల్యాణి శనివారం దర్శించుకున్నారు. 15వ అదనపు జిల్లా న్యాయస్థానం జడ్జి నాగ శైలజ, నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గా కల్యాణి అంజనీపుత్రునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు శృంగారం రామానుజాచార్యులు నేతృత్వంలో హనుమంతునికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను న్యాయమూర్తులు స్వీకరించారు.

సీఎం సహాయనిధి రూ.లక్ష మంజూరు



మృతుని కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆపదలో ఉన్న అభాగ్యులకు ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన దిమ్మిటి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించటంతో ఆయన కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీని దిమ్మిటి శంకర్ భార్య మల్లేశ్వరి ఆశ్రయించటంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సిఫార్సు చేశారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిమ్మిటి శంకర్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేశారు. ఈ మొత్తాన్ని శనివారం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ చేతుల మీదగా దిమ్మిటి శంకర్ భార్య మల్లేశ్వరికి అందించారు. ఆపత్కాలంలో ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోడెబోయిన బాబి, గూడవల్లి రత్న సుధాకర్, ఆత్మూరి బాలాజీ, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి నిర్మల పాల్గొన్నారు.

దళిత క్రిస్టియన్‌లను ఎస్సీల్లో చేర్చి తీరుతాం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: దళిత క్రిస్టియన్‌లను ఎస్సీల్లో చేర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని హొసన్నా ప్రార్థనామందిరంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం పాస్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ క్రిస్టియన్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చర్చిలు, శ్మశానవాటికల అభివృద్ధికి నియోజకవర్గానికి రూ.కోటి నిధులను సీఎం జగన్ కేటాయించారన్నారు. ఉయ్యూరు పట్టణంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు, శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. పట్టణంలో ఎక్కడా 2 ఎకరాల పొలం అందుబాటులో లేకపోవటంతో శ్మశానవాటికకు స్థలం ఏర్పాటు జాప్యం అయిందన్నారు. క్రిస్టియన్‌లందరికీ ఆమోదయోగ్యం అయితే నాగన్నగూడెం–ఎగినపాడు ప్రాంతాల నడుమ సొంతంగా ఎకరం పొలం ఇస్తానని ఎమ్మెల్యే పార్థసారథి చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), ఫెలోషిప్ ప్రతినిధులు జాన్ క్రాస్, మాచవరపు రాజేష్, స్టీఫెన్, డానియేల్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పురోగతికి దోహదం



రామవరప్పాడు ఆర్బీకేలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, డ్వాక్రా మహిళలు

రామవరప్పాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడేలా అనేక పథకాలు చేపట్టారని జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. సీఎం జగన్ వైఎస్సార్ ఆసరా ఆర్థిక సాయాన్ని విడుదల చేసిన సందర్భంగా విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు విశాల సహకార బ్యాంకు ఆర్బీకేలో శనివారం జగన్ చిత్రపటానికి మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామవరప్పాడులో 260 గ్రూపులకు గాను రూ.27475189, ప్రసాదంపాడు 235 గ్రూపులకు రూ.26751366, గూడవల్లిలో మొత్తం 46 గ్రూపులకు రూ.3980611, నిడమానూరులో 159 గ్రూపులకు రూ.13986906, ఎనికేపాడులో 172 గ్రూపులకు రూ.19347066 డ్వాక్రా సంఘ ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ ఈ పథకంతో మహిళా సాధికారత మరింత మెరుగుపడిందన్నారు. పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మొత్తం సొమ్మును నాలుగు దఫాలుగా నేరుగా సంఘం పొదుపు ఖాతాల ద్వారా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ దూరు రత్నం, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అభినందనీయం

ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి



బోరు పనులను శంకుస్థాపన చేసి ప్రారంభిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో పునాదిపాడుకు చెందిన రేమా వర్షిప్ సెంటర్ ఆర్థిక సహకారంతో రూ.లక్ష అంచనా వ్యయంతో చేపట్టిన బోరు నిర్మాణ పనులకు శనివారం ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, స్థానిక ప్రతినిధులు గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న పలు సమస్యలను ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో స్వచ్ఛంద సంస్థలు తమ వంతు భాగస్వామ్యాన్ని అందించటం అభినందనీయమన్నారు. మెరుగైన తాగునీటి వసతుల కల్పనకు ఆర్థిక సహకారం అందించిన రేమా వర్షిప్ సెంటరు ప్రతినిధి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్‌ను ఎంపీపీ రాజ్యలక్ష్మి, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, మేరుగు విజయ చంద్రశేఖర్, జుజ్జువరపు ఎలీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు వీర్ల మోహనరావు, లాం సురేష్, ముసిబోయిన మోహనకృష్ణ, ఈఓ కూర్మారావు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మోసం చేసిన చంద్రబాబు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: నిరుద్యోగ నైపుణ్య శిక్షణ పేరుతో యువతను నారా చంద్రబాబునాయుడు నిలువునా మోసం చేశాడని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. ఆయన శనివారం తాడిగడపలో విలేకరులతో మాట్లాడుతూ దేశచరిత్రలో నిరుద్యోగులను మోసం చేసిన అతిపెద్ద స్కామ్ చంద్రబాబు హయాంలో జరిగిందన్నారు. సీమెన్స్ లాంటి ప్రైవేటు సంస్థ ఎక్కడైనా రూ.3 వేల కోట్లు గ్రాంటు ఇస్తుందా అని ప్రశ్నించారు. ఈ కుంభకోణంపై ఇప్పటికే జీఎస్టీ, ఇంటిలిజెన్స్, ఈడీ, సీఐడీ దర్యాప్తు చేస్తున్నాయన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని ఈడీ అరెస్టు చేసిందన్నారు. షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు రూ.371 కోట్లు చేరినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. చంద్రబాబు చెప్పినట్లే నిధులు విడుదల చేసినట్లు నోట్ ఫైల్‌పై అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రాశారన్నారు. డీపీఆర్ లేకుండా నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించారు. ప్రాజెక్టుకు సంబంధించి నోట్‌ఫైల్ కూడా మాయం చేశారన్నారు.

రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోకు రామవరప్పాడు విద్యార్థుల ఎంపిక

రామవరప్పాడు: ఈఎండీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) పారిశ్రామిక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఎక్స్‌పోలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 28న జరగబోయే రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోకు రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ తాయారు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఇటీవల పటమట హైస్కూల్‌లో నిర్వహించిన ఎక్స్‌పోలో 9వ తరగతి విద్యార్థులు బి.నందిని, డి.దివ్య,ఎస్.చందన, పావని నూతన వ్యాపార అభివృద్ధిపై తమ ఆలోచనలతో ఉత్తమ నమూనాలు ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోకు ఎంపికైనట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: కానూరులో ఇంటర్ విద్యార్థి అదృశ్యం అవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు శ్రీభవిష్య జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న ప్రకాశం జిల్లా కంభంకు చెందిన గంటా హేమంత్ ఈ నెల 23వ తేదీన పరీక్ష రాసిన తరువాత కాలేజీ హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడు. కాలేజీ ప్రిన్సిపాల్ పెరుమళ్లస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు కంకిపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం

కంకిపాడు: పట్టణంలోని ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఈనెల 26న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. యావేపుల్ గాస్పెల్ మినిస్ట్రీస్, రేమా వర్షిప్ సెంటరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరంలో సెంటిని ఆసుపత్రి వైద్య బృందం వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 3 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటిరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితునికి సీఎం రిలీఫ్ చెక్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన అవుతు కోటిరెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 60 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కోటిరెడ్డి మోకాలు ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సహాయం కోరుతూ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే వంశీమోహన్ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం 60 వేల రూపాయలను మంజూరు చేయించారు. ఆ చెక్‌ను నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, అవుతు సుధాకర్‌రెడ్డి, కిరణ్ కలసి కోటిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు కోటిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు మరమ్మతుకు ఎమ్మెల్యే వంశీ ఆదేశం



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని ఉపాధ్యాయనగర్ రోడ్డు అభివృద్ధికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశించారు. ఎస్సీ కాలనీలో ఇటీవల మృతి చెందిన దళిత మత్స్య సహకార సంఘ సభ్యుడు తిరివీధి యేసు కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. తిరిగి వెళ్తున్న క్రమంలో అధ్వానంగా ఉన్న ఉపాధ్యాయనగర్ రోడ్డును ఆయన పరిశీలించారు. వెంటనే పంచాయతీరాజ్ ఏఈ, పంచాయతీ ఈవోను అక్కడికి పిలిపించిన ఎమ్మెల్యే రహదారి అభివృద్ధిపై చర్చించారు. ముందుగా బురదమయంగా ఉన్న రోడ్డును గ్రావెల్, డస్ట్‌తో మెరక చేయాలని పంచాయతీ ఈవో బాపూజీకి సూచించారు. తర్వాత మండల పరిషత్ నిధులతో ఈ రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న

తాడిగడపలో గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పార్థసారథి



తాడిగడపలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన తరువాత రాష్ట్రంలో తిరిగి ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని తాడిగడపకు చెందిన ఆర్.వెంకటశివరామకృష్ణ, వై.వెంకటేశ్వరరావు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శనివారం తాడిగడప సచివాలయం–3 పరిధిలో కాలువ కట్టపై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ బ్రోచర్‌లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు భరోసా కల్పించారన్నారు. వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పింఛన్ ఇలా అనేక పథకాలు నేరుగా అమలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. స్థానికంగా డ్రైనేజీ నిర్మాణం చేయాలని, దోమల సమస్య నివారించాలని స్థానికులు కోరారు.

ప్రజలతోనే ఉన్నాం...

ఎన్నికల తరువాత తాము ప్రజలతోనే ఉంటూ ప్రజల కోసమే పని చేస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేశామన్నారు. ఇళ్లు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చామని తెలిపారు. అందరూ గృహాలు కట్టుకుని గృహ యజమానులుగా మారాలని అన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా సంక్షేమ పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.ప్రకాశరావు, పార్టీ నేతలు హనుమంతరావు, పోలవరపు బాబి, షేక్ ఖాదర్‌బాషా, ఎన్.ఎల్లారావు, నర్రా చంటి, షేక్ హుస్సేన్, కిషోర్, ఈదా రాజేష్, అంగిరేకుల సీతారామయ్య, వేమూరి బాలకృష్ణ, సాబూ, పిన్నబోయిన రవి, పలువురు పాల్గొన్నారు.

ఔషధ రంగంలో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఫార్మసీ ప్రొఫెషనల్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ చెన్నుపాటి

రామవరప్పాడు: అభివృద్ధి దిశగా దూసుకుపోతున్న ఔషధ రంగంలో ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ చెన్నుపాటి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ తెలంగాణ శాఖ, వెస్టిండీస్ అంతర్జాతీయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఔషధ రంగంపై రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని తొలి రోజు అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ అధినేత డాక్టర్ రాజీవ్ దహియా అంతర్జాలంలో ప్రారంభించగా, రెండో రోజు కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఔషధ రంగంలో లోటును పూడ్చాల్సిన బాధ్యత యువత, ఫార్మసీ విద్యార్థులపై ఉందన్నారు. తెలంగాణ నుంచి హాజరైన డాక్టర్ ఎ.మురళీధర్ రావు మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు నూతన పరిశోధనలు చేసి మానవాళికి ఉపయోగపడే ఔషధాల తయారీపై శ్రద్ధ చూపాలన్నారు. వెస్టిండీస్ అంతర్జాతీయ శాఖకు సంబంధించిన డాక్టర్ టెర్రి రమణన్ సింగ్ ఔషధ రంగంపై వాటిలోని మెలకువలపై అంతర్జాలంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన అంతర్జాలం సహాయంతో ఇచ్చిన శాస్త్రీయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన మద్రాసు, ఉత్తర ప్రదేశ్, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. సదస్సులో చెన్నై నుంచి డాక్టర్ రోనాల్డ్ డార్విన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఫార్మసీ విభాగాధిపతి పి.పురుషోత్తమ రెడ్డి, పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు 9 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు

నున్న(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం చదువులో ప్రతిభ గల విద్యార్థులకు అందించే జాతీయ ఉపకార వేతనం కింద నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ విద్యార్థులను అభినందిస్తూ శనివారం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ 8వ తరగతిలో ప్రతిభ కనబర్చిన 9 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనం పొందడానికి ఎంపికైనట్టు తెలియచేశారు. వీరికి మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ వరకు ఉపకారవేతనం అందుతోందన్నారు. పళ్ళపోతు రాజేష్, పానకాల భవ్యశ్రీ, కాటూరి కారుణ్య, తోట శ్రీసాయిగీతిక, బెజవాడ వరుణ్‌తేజ, గాజుల సంధ్య, గుంటా ప్రణతి, బోటమ్ బ్లెస్సీ, కాసరెల్లి హారిక ఎంపికయ్యారని హెచ్ఎం తెలియజేశారు.

ఉంగుటూరులో మూడవ విడత ఆసరా రూ.10 కోట్లు



ఉంగుటూరులో కేక్ కట్ చేస్తున్న మహిళలు

ఉంగుటూరు: మండలంలో వైఎస్సార్ ఆసరా మూడవ విడతగా 1081 డ్వాక్రా గ్రూపులలోని 10827 మంది మహిళలకు రూ.10కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగనన్న ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు విడతల వారీగా నగదు జమచేస్తున్నారని చెప్పారు. ఈ నెల 28న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా వేడుకలకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ హాజరవుతారని తెలిపారు.